# ఔరా ఆవకాయ!

యస్. వివేకానంద

కూరలలో కెల్లా వంకాయ నెంబర్ వన్.
ఊరగాయలలో ఆవకాయ టాప్.

అందుకనే మిగతా 'పికిల్స్' అంటే లైక్ చేయని రాంబాబు టాపరే!

ఇడ్లీల్లో ఎవరైనా కొబ్బరి చట్నీ, శనగ చట్నీ, కారంపొడో... అల్లంపచ్చడో నంజుకు తింటారు. కానీ రాంబాబుకి అవేమీ నచ్చవు. ఎంచక్కా ఆవకాయ నంజుకు తినడం చిన్నప్పటి నుంచి అలవాటు. ఒక్క ఇడ్లీలోనే కాదు దోసెలలో, ఉప్మాలో, పూరీలో, చపాతీలో... దేన్లోనైనా సరే రాంబాబుకు ఆవకాయ వుండాలి.



భోజనం చేసేటప్పుడు కూడా... కందిపచ్చడిలో ఆవకాయ మిక్స్ చేసి తింటాడు. ముద్దపప్పులో కలుపుకు తినడానికి ఆవకాయే మెయిన్.

అలా... ఆవకాయ ఊరగాయను రకరకాలుగా కలుపుకుని తింటూ తన్మయత్వంతో మైమరిచి లొట్టలేసుకుంటూ...పెద్ద పెద్ద ముద్దలు చేసుకుని...నోరు బార్లాగా తెరచి నములుతూ తింటున్నంత సేపూ పక్కవారితో సైతం మాట్లాడడు. పలుకరించినా పలుకడు. కళ్లు రెండూ మూసుకొని నోట్లో పెట్టుకున్న ముద్ద నములుత్తూంటే అచ్చంగా ఆవుగడ్డి మేస్తూ నెమరేస్తున్నట్లే వుంటుంది.

ఆవకాయ అతిగా తినద్దంటూ మమ్మీ నెత్తీనోరు మొత్తుకున్నా వినడు. ఇదేం ముదనష్టపు అలవాటో? ఎవరైనా చూస్తే దిష్టి చేటు అనేసి మమ్మీ మనసులోనే గొణుక్కుంటూంటుంది.

కూట్లోకి ముప్పొద్దులా ఆవకాయ వుంటే సరి మరోటి వడ్డించమని అడగడు. అది రాంబాబు మార్క్ టేస్ట్! పాతికేళ్లు వచ్చి ఉద్యోగం వెలగబెడుతూ... పెళ్లి చేసుకున్న రాంబాబుని బంధువర్గంలో వారంతా... ఆవకాయ రాంబాబనే పిలుస్తుంటారు. ఆవకాయ కలిపిన అన్నమే ఆఫీసుకు వెళ్లేటప్పుడు కూడా బాక్స్‌లో పెట్టి తీసుకెళతాడు. రాంబాబు ఆవకాయ అన్నం తింటుంటే ఆ సువాసన ఘాటు పక్కవారి నాసికాపుటాలకి సోకి లంచ్ అవర్లో ఆత్మీయుడెవరైనా ఒక్క ఆవకాయ అన్నం ముద్ద పెట్టమని నోరారా అడిగినా, చేయి చాచినా ససేమిరా పెట్టడానికి మనస్కరించదు.

ఏటా సీజన్లో వంద మామిడికాయలు కొని ఆవకాయ జాడీలకి పెట్టిస్తాడు. ఇంటికే బంధువు వచ్చినా ముక్కలపులుసు చేయించి, ముద్దపప్పు వండించి ఆవకాయ వడ్డించమని శ్రీమతికి చెప్తాడు.

పెళ్లినాడు వధువు చి.ల.సౌ. పేరిందేవికి వరుడు రాంబాబుకి బంగారు పువ్వుతో వున్న వెండికంచంలో విందుభోజనం వడ్డిస్తే...కంచంలోని పదార్థాల పేర్లు అడిగి మరీ తెలుసుకొని వాటిని పక్కకు నెట్టి... ''ఆవకాయ ఏది? వడ్డించరేం?'' అని అందరికీ వినిపించేలా గావుకేక పెట్టాడు. రాంబాబు అరుపులకి కొత్త పెళ్లికూతురు ఝడుసుకుంది. పెళ్లి పందిట్లో వారంతా ఏం కొంప మునిగిందోనని పరుగెత్తుకొచ్చారు.

'నీ ఆవకాయ పాడుగాను... ఇన్ని వంటకాలు కంచంలో వుండగా? అదెందుకు గుర్తుకొచ్చిందిరా ఇప్పుడు? ముష్టి ఆవకాయ కోసం గొంతు చించుకుంటాడేమిట్రా వెధవ పీనుగ?.... నడ్డి మీద చేయి ఆన్చి ముక్కు చివరికంటా వచ్చిన కళ్లజోడులోంచి చూస్తూ... కొడుకు దగ్గరకొచ్చి మనుమడి గురించి క్వశ్చన్ చేసింది బామ్మ.

'అంతా నీ పెంపకమేగా? అందుకే వాడి గావు కేకలు ఆవకాయ కోసం..' తల్లి ముఖంలోకి ఎగాదిగా చూచి చిరుకోపం ప్రదర్శించాడు రాంబాబు తండ్రి. రాంబాబు బామ్మకి మనుమడు! అంటే పెద్దకొడుక్కి చిన్న కొడుకన్నమాట!

'ఆవకాయ వడ్డించండి. లేకపోతే నా కొడుకు ముద్ద ముట్టడు. రాంబాబు తల్లి సావిత్రమ్మ పక్కనే వున్న వియ్యపురాలితో రుసరుసలాడింది.

పెళ్లి జరుగుతోంది. మ్యారేజ్ హాల్లో! భోజనాలు తయారు చేసి వడ్డిస్తోంది కేటరింగు వాళ్లు. పెండ్లి కుమార్తె తండ్రి కేటరింగ్ వారికి చెప్పిన మెనూలో ఆవకాయ అయిటం లేకపోవడంతో... దాన్ని తేలేదు.

''ఇప్పటికిప్పుడు ఆవకాయ తెమ్మంటే ఎలా గండీ?'' కేటరింగ్ మేనేజర్ నిప్పులు తొక్కిన కోతే అయ్యాడు.

ఆడపెళ్లి వాళ్లు 'డీలా' పడ్డారు. పెండ్లి కుమారుని కోరిక తీర్చలేని తమ బ్రతుకెందుకన్నట్లు పిల్ల తల్లీతండ్రి తీవ్రంగా కలత చెంది ఓ తెగ బాధపడి పోతున్నారు. పక్కనే కూర్చున్న పెండ్లి కూతురు తొడ గిల్లిన రాంబాబు 'ఆవకాయ వడ్డించకపోతే నాకు చిర్రెత్తుకొస్తుంది.... మీ మమ్మీడాడీతో చెప్పు..' అంటూ చెవి కొరికేడు. కావలసిందేనంటూ చంటిపిల్ల వాడిలా యాగీ చేసాడు. ఆవకాయ వెండి విస్తట్లో వడ్డించే వరకూ ఎంగిలిపడేది లేదని నిరాహార దీక్షకు ఉపక్రమించాడు.

పెండ్లి కుమార్తె పేరెంట్స్ రాంబాబుని బుజ్జగించాలని చూశారు. గడ్డం పుచ్చుకొని బ్రతిమాలాడారు. కాళ్లు కడిగి కన్యాదానం చేసారు కనుక మరోసారి కాళ్లు పట్టుకునేటందుకు సిద్ధపడ్డారు మామగారు.

పెళ్లి గ్రాండ్‌గా జరిగినా భోజనాల దగ్గరకు వచ్చేసరికి అంతా ఆగం ఆగం అయింది. మగపెళ్లి వారెవరూ భోజనానికి ఉపక్రమించలేదు. పెండ్లి కొడుకు అలిగినప్పుడు తాము మాత్రం ఎలా తింటామని ఎదురు ప్రశ్న వేశారు. పెళ్లికొచ్చిన వారంతా ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుకుంటున్నారు.

పైసా కట్నం తీసుకోకుండా ఈ సంబంధం ఒప్పుకున్నాం. కనీసం అత్తగారికి, ఆడబిడ్డలకు లాంఛనాలు కూడా అక్కర్లేదనుకున్నాం. అలాంటిది పెండ్లి కుమారుడు ఆఫ్టాల్ ఆవకాయ కావాలని అడిగితే... ఆడపెళ్లివారు ఏర్పాటు చేయలేకపోయారు. రాంబాబు తండ్రి మరో బాంబు పేల్చాడు.

ఓ వైపు పెళ్లికుమార్తె చి.ల.సౌ. పేరిందేవికి కడుపులో ఎలకలు పరుగెడుతున్నాయి. ఆకలి దంచేస్తోంది. కళ్లు తిరుగుతున్నట్లు అనిపిస్తోంది. మొగుడు తిరస్కరించినప్పుడు తాను ఎలా తినగలదు? ఆడదానికి అప్పుడే సంసారంలో కష్టాలు మొదలైనయ్యన్న మాట అనుకుని దిగులుపడింది.

'అయ్యా ఈ పూటకి మమ్ములను మన్నించి భోజనాలు పూర్తి చేయండి. రాత్రి డిన్నర్‌కి ఆవకాయ అందరికీ వడ్డించే ఏర్పాటే చేస్తాను...' అంటూ ఆడపిల్ల తండ్రి ప్రాధేయపడ్డాడు.

అయినా మగపెళ్లి వారి మనసు కరగలేదు. (ఐస్ ముక్క అయితే కదా కరగడానికి? మగపెళ్లి వారి మనసు ఉక్కుముక్క కదా?)

పెళ్లికొడుక్కి ఇదేం ఆవకాయ పిచ్చండీ బాబూ? ఈ విచిత్రం ఎక్కడా చూడ్లేదు. చోద్యంగా వుంది! కొందరి కామెంట్.

'ఆవకాయ మా ఇంట్లో పెట్టుకోని ఎరగం వదినగారూ! మా ఇంటిల్లపాదికీ 'పెప్టిక్ అల్సర్' వ్యాధి వుంది. డాక్టర్ మా ఇంట్లో వారందరినీ ఆవకాయ, పండు మిరపకాయ కారం వంటి ఊరగాయలు తినొద్దని శాసించాడు.' పెండ్లి కుమార్తె తల్లి రాంబాబు తల్లితో పరిస్థితిని సమర్థించుకుంటూ చెప్పింది.

'ఈ మాట నాకెందుకు చెప్పడం? అడుగో అక్కడున్న మీ అల్లుడితో చెప్పండి. కావాలని కోరింది... ఆవకాయ లేనిదే ముద్ద ముట్టనని అన్నదీ మీ అల్లుడే!' చిటపటలాడింది రాంబాబు తల్లి.

రాంబాబు మిత్రబృందమంతా ఏకమై 'ఆవకాయ వడ్డించాల్సిందే! ఆడపెళ్లివారూ డౌన్ డౌన్' అంటూ నినాదాలు మొదలు పెట్టారు పెళ్లి పందింట్లో.

అరుపులు...కేకలు...నినాదాలు....నిరసనలు.. కుర్చీలు నేలకేసి కొట్టారు. ఆడపెళ్లి వారి మీద తిరగబడ్డారు. అక్కడి వాతావరణం పార్లమెంటుని, అసెంబ్లీని తలపించింది.

ఆవకాయ కోసం ఇంత 'రభస' జరగడం చూసి పెళ్లికొచ్చినవారంతా ముక్కున వేలేసుకున్నారు. విస్తుపోయారు. అసలు విషయమేమిటని మగపెళ్లివారిని ఆరాతీయగా తెలిసిందేమిటంటే....

రాంబాబు పసితనం నుంచీ బామ్మ దగ్గర పెరిగాడు. అయిదేళ్లు వచ్చేదాకా రాంబాబు వంటిన నూలుపోగు వుండేది కాదు. బామ్మకి చచ్చేటంత మడి, ఆచారం. గుడ్డలు తొడిగితే మనుమడు తనను ఎక్కడ తాకి మైలపడేస్తాడేమోనని భయం. అయిదో ఏడు వచ్చినప్పటి నుంచి పన్నెండు వెళ్లేవరకూ తడిపి ఆరేసిన అంగవస్త్రం కట్టుకునేవాడు రాంబాబు. అటక మీద వుంచిన ఆవకాయ జాడీని నిచ్చెన వేసుకొని కిందకు దించి, కాస్త ఊరగాయను బామ్మ తీసి బయటపెట్టుకున్నాక మళ్లీ పెద్ద జాడీని అటక మీద పెట్టించేది. బామ్మకు రోటి పచ్చళ్లు చేయడం ఇష్టముండదు. ఏటికేడాదీ నిలవ వుండే ఆవకాయ మాత్రం పెట్టి వుంచేది. అన్నంలోకి,...టిఫిన్‌లోకి అన్నిటికీ అదే! ఆవిధంగా అలవాటు కావడంతో రాంబాబుకి ఆవకాయ కంచంలో కనిపించకపోయినా ఒక్కపూట తినకపోయినా భోజనం చేసినట్లు అనిపించని పరిస్థితి ఏర్పడింది.

ప్రచ్ఛన్న యుద్ధానికి తెరదించాలంటే ఆవకాయ తెప్పించడం ఒక్కటే మార్గమని, వేరే ప్రత్యామ్నాయం ఏదీ లేదనే నిర్ణయానికొచ్చాడు పెళ్లికుమార్తె తండ్రి. ముగ్గురు బావమరుదులను పిలిచి కార్లేసుకొని వెళ్లి సిటీ అంతా గాలించి నాలుగైదు జాడీల ఆవకాయను స్వగృహ ఫుడ్స్ నుంచి కొని తీసుకురమ్మని చెప్పి పంపాడు.

గాలింపు చర్య మొదలుపెట్టి పాతికి కిలోమీటర్ల దూరం సందులు గొందులు తిరిగి ఎలాగైతేనేం స్వగృహ ఫుడ్స్ వారి దుకాణాన్ని వెతికిపట్టుకున్నారు. ఆవకాయ జాడీలను కార్లలో పెట్టుకొని, కుదుపులకు దొర్లిపోకుండా, చిందిపోకుండా జాగ్రత్తగా పట్టుకుని మ్యారేజ్ హాలుకు చేరుకున్నారు.

ఆవకాయ జాడీలను భుజాన పెట్టుకుని పందిట్లోకి నడిచివస్తున్న వాళ్లని అల్లంత దూరంలోనే చూచీ చూడగానే ఎగిరి గంతేసినంత పనిచేశాడు. ఆవకాయ వచ్చేసిందోచ్ అంటూ మురిసిపోయాడు రాంబాబు. ఇన్ని తిప్పలు పెట్టి మొండికేసిన రాంబాబును మరికొంచెం ఆట పట్టించాలని ఆవకాయ వడ్డన ముందుగా మగపెళ్లి వారి ముందున్న విస్తళ్లలో సర్వ్ చేస్తూ వచ్చారు. ముందు మాకు వేయవచ్చుగా? మనసులోనే ఉడుక్కున్నాడు. ఎప్పుడెప్పుడు ఆవకాయ ముద్ద నోట్లో పెట్టుకుందామా అని ఉవ్విళ్లూరుతున్నాడు రాంబాబు. చిట్టచివరికి నూతన వధూవరుల వెండి కంచాల్లో వడ్డించి మిగిలిన జాడీలను రాంబాబుకి అందుబాటులో వుంచారు.

ఎండాకాలం...పైగా కొత్త ఆవకాయ! కలుపుతుంటుంటేనే కమ్మదనం నాసికాపుటాలకు తాకుతోంది. చవులూరుతోంది. వెండికంచంలోని మిగతా పదార్థాలన్నింటినీ పక్కకు నెట్టిన రాంబాబు మొత్తం అన్నంలో ఆవకాయ కలిపి పిసుకుతూ ఇంతింత ముద్దలు చేయడం పక్కనే వున్న పేరిందేవి క్రీగంట గమనిస్తూ ఇతరులు గమనించకుండా మనసులోనే నవ్వుకుంటోంది. పెళ్లికొడుకు ఆవకాయ అన్నం తినడం చూసి అత్తమామలు...తల్లిదండ్రులు...పెళ్లికొచ్చిన వారంతా సంబరపడిపోతూ...'హమ్మయ్య ఎలాగైతేనేం పెండ్లికొడుకు కోరిక తీర్చగలిగాం' అనుకొని తృప్తిపడ్డారు.

ఆవకాయ అన్నం రుచి పాపం పేరిందేవికి బొత్తిగా తెలియదు. ఆశగా తన కంచం వైపే చూస్తుండడంతో ఓ ముద్ద పక్కనే వున్న భార్యామణి నోట్లోపెట్టాడు. నోట్లో వున్న ఆవకాయ ముద్దని నములుతూ....

'ఓసి దీని దుంపతెగిపోనూ... ఎంత కమ్మగా వుందో? అందుకే నా మొగుడు ఆవకాయ కోసం ప్రాణాలిస్తాడు...' అనుకొని మరో ముద్ద పెట్టమంటూ నోరు తెరిచింది పేరిందేవి ముసిముసి నవ్వులు చిందిస్తూ....

★